# ఇన్లాండ్ లెటర్ కథలు

## కొసమెరుపు

అలవాటు ప్రకారం ఆ రోజు కూడా ఫ్రెండ్స్ అందరం వంతెన (కాలువపై కట్టిన)పై కూర్చుని ఆ రోడ్డుమీద వచ్చిపోయే అమ్మాయిల్ని టీజ్ చేస్తూ వున్నాం. మా ఆకతాయి పనులకు ఆటంకం చెప్పేవారెవరూ లేకపోవడంతో క్రమక్రమంగా మా చేష్టలు శృతిమించసాగాయి. రోడ్డుమీద వచ్చిపోయే అమ్మాయిల్ని ఆటపట్టిస్తూ... అపహాస్యం చేస్తూ... ఆనందంతో కేరింతలు కొడుతున్నాము. మాలోని కొందరు చేతుల్లోని సిగరెట్లు వదులుతున్న పొగలు మాలోని కర్కశత్వాన్ని మేల్కొలుపుతున్నాయి. ఒకరి చేతుల్లోని సిగరెట్లు మరొకరి చేతుల్లోకి మారుతున్నాయి.

సమయం సాయంత్రం 5.00 గం. అవుతున్నట్టుంది. బహుశ, ట్యూషన్‌కు వెళ్ళే అమ్మాయిల గుంపొకటి మా వైపుగా వస్తోంది. వారిని టీజ్ చేయడం కోసం మాలోని కొందరు కొత్త పద్ధతులను వెతుకుతున్నారు. మరికొందరు వారి ముందు హుందాగా కనిపించడం కోసమని కొత్త సిగరెట్లు వెలిగిస్తున్నారు. ఆ అమ్మాయిల వైపు చూస్తూ... మాలోని ఒకడు వారిలోని ఎల్లో డ్రెస్ అమ్మాయి తనకి నచ్చిందని, మరొకడు బ్లూ డ్రెస్ అమ్మాయి నచ్చిందని... ఇంకొకడు స్పెక్టికల్స్ నచ్చిందని ఈవిధంగా అమ్మాయిల గుంపును మాలోని కొందరు పంచుకున్నారు. ఆ గుంపు మమ్మల్ని సమీపించగానే ఏం అమ్మాయిలూ... మీకు పాఠాలు ఆ ముసలి మాస్టార్లే చెప్పాలా? మాలాంటి యువకులతో చెప్పించుకోవడం తప్పనుకుంటున్నారా?... మాకూ ఓ అవకాశం ఇచ్చి చూడండి! ఆ ముసలి పీనుగులకంటే మేమే బాగా చెప్పగలమని మీ నోటినుండే అనిపిస్తాం అని మాలోని ఒక మిత్రుడు డైలాగులు కొట్టగానే వాడు చేసిన గొప్ప కార్యానికి అభినందనలు తెలుపుతున్నట్టుగా మిగతా వారమంతా పగలబడి ఒకటే నవ్వు. శృతి మించిన చేష్టలతో ఆ దారిన వచ్చిపోయే అమ్మాయిల్ని టీజ్ చేస్తూనే వున్నాం

మా నవ్వును ఆటంకపరుస్తూ... మాలోని ఒకడు కొంత దూరం నుండి వయ్యారంగా... నడుచుకుంటూ వస్తున్న ఓ అమ్మాయిని చూపించాడు. ఆ అమ్మాయి నడకని (మాకు కాస్త దూరంగా వుండడం వలన ముఖం మసకగా కనిపిస్తోంది) చూసి కొందరు ఆ అమ్మాయి నడక హంసనడకలా వుందని, దేవకన్యలా నడుస్తోందని ఒకడు, నా ఊహల రాణి అని ఇంకొకడు పోలుస్తూ.. స్తుతిస్తూ ఉండగా ఆ అమ్మాయి నిమిష నిమిషానికి మాకు దగ్గరకు రాసాగింది. అంతలోనే ఒకడు చారెడు కళ్ళతో ఆమె దిక్కుగా రెప్ప వాల్చకుంటా చూస్తూ... ఆమెకు చెస్టు బాగా వుందని (వక్షస్థలం ఉబ్బుగా ఉందని) అనగానే వాణ్ణి అనునయిస్తూ... ఆమె సీటు కూడా బాగా వుండి వుంటుందని (పిరుదుల భాగం) మరొకడు పట్టలేని ఆనందంతో రెచ్చిపోయి అభివర్ణిస్తున్నారు. ఆ అమ్మాయి మాకు దగ్గరవుతున్న కొద్దీ అటువైపుగా ఆత్రుతతో చూస్తున్నా నాలో అసంకల్పితంగా ఎవరివో రూపురేఖలు గుర్తుకు రావడం మొదలయింది. నాకు పరిచయమున్న ముఖకవళికలేవో నా కళ్ళ ముందు కదలాడసాగాయి. ఆమె మాకు దగ్గరవుతున్న కొద్దీ.. నా ముఖంపై రంగులు మారిపోతున్న భావన నాలో అరచేతులు చెమటలు పడుతున్నాయి. అప్పటికీ జరుగుతున్నదేంటో గమనించకుండా 'ఆ' ఇద్దరు స్నేహితులు అదే ఊపులో ఉన్నారు. పరిస్థితిని గమనించిన మిగతావారు వారిద్దరినీ వారించే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళిద్దరూ ఆ ఊపులో తన్మయత్వం పొందుతూ ఉండడం మూలన (ఆపాటికి ఆ అమ్మాయి మా దగ్గరికి చేరలేదు) వారు మామూలు మనుషులు అవటానికి కాస్త ఎక్కువ సమయమే పట్టింది... ఇంతలోనే 'అక్కయ్య' మమ్మల్ని చేరుకుంది. అక్కయ్యను చూడగానే నా నరాలు బి-గు-సు-కు-పో-యా-యి.

అక్కయ్య మా వైపు చూస్తూ... ఏంట్రా! కట్టకట్టుకుని మీ అందరూ ఇక్కడ పోగయ్యారు... దేశాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్ళాలని ప్రణాళికలేమైనా సిద్ధం చేస్తున్నారా? అన్న ఆప్యాయతతో (ఈ పలకరింపు ఆమె మంచితనానికి ప్రతీక) మందలింపు. సమాధానం కోసం మా నోట మాట పెగల్లేదు. ఈ మాట అంటూనే అక్కయ్య ముందుకు కదిలింది. మా అక్కయ్య నాకు దూరమవుతున్న కొద్దీ నా కళ్ళల్లో నుండి వదుస్తున్న కన్నీటి వేగం ఎక్కువయింది. నా ముఖం చూడలేక నా స్నేహితులంతా ఒక్కసారిగా అక్కడినుండి జారుకున్నారు.

అప్పటిదాకా నేను చేసిన చేష్టలకు నా శరీరం సిగ్గుతో కుచించుకుపోయింది. నాలో అంతర్మథనం మొదలయ్యింది. నాలో కర్కశత్వం తాలూకు పొరలు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. నా గుండె కాస్త తేలికయినట్టు భావన... కన్నీటి వేగం తగ్గుముఖం పట్టింది. వెరసి నాలో మానవత్వం, సోదర భావం... చెప్పడానికి వీలుకాని మరెన్నో భావనలు చోటుచేసుకున్నాయి. సిగ్గుతో కుచించుకుపోయిన నా శరీరం ఒక్కసారిగా విప్పారింది.

—పిల్లలమర్రి శ్రీనివాస్

## మోసం

"మేడమ్"

తలెత్తి చూసింది జయ. ఎదురుగా పాతికేళ్ళ కుర్రాడు. తెల్లని తెలుపు. మొహాన విభూతి రేఖలు. మధ్యన కుంకుమ బొట్టు. చేతిలో ఒక నోట్ బుక్. దాంట్లో ఒక శుభలేఖ.

"మేడమ్! ఈ నెల ఇరవై ఏడో తేదీన మా చెల్లెలి పెళ్ళి. మాకు తల్లి దండ్రులు లేరు. నేను ఉదయం పాల పేకెట్లు ఇచ్చి, పేపర్ వేసి, సాయంత్రం ట్యూషన్లు చెబుతూ, సంపాదిస్తున్నాను. ప్రైవేట్‌గా బి.య్యే. చదువుతున్నాను. చెల్లెలికి సంబంధం కుదిరింది. కట్నం లేదు గానీ పెళ్ళి ఖర్చుకి డబ్బు బాగా అవసరమౌతుంది. దయచేసి మీకు తోచినంత సాయం చేయండి. "శుభలేఖ చూపిస్తూ వివరాలు చెప్పాడతను. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన జయకు ఆడపిల్ల పెళ్ళి ఎంత సమస్యో బాగా తెలుసు." తన పెళ్ళికి తండ్రి చేసిన అప్పు రెండేళ్ళైనా ఇంకా తీరుస్తూనే ఉన్నాడు. జయ ఎదురుగా నిల్చున్న తని అభ్యర్థనని కాదనలేక బాగ్ తీసి చూసింది. అన్నీ పది రూపాయల కాగితాలు, రూపాయి బిళ్ళలు ఉన్నాయి. మరీ ఒక్క రూపాయి యివ్వలేక పది రూపాయల కాగితం ఇచ్చింది. అతను "థాంక్స్" చెప్పి, పక్క సీటు కళ్యాణి దగ్గర కెళ్ళాడు. నెల మొదటివారం కావడం చేత ఆఫీస్‌లో అందరూ అతనికి ఎంతో కొంత డబ్బు ఇచ్చారు. ఆ రోజు మేనేజర్ శలవు. కనుక లంచ్‌లో ఆఫ్ డే లీవ్ పడేసి జయ, కళ్యాణి కలసి సినిమా కెళ్ళారు. అది ఇంగ్లీష్ పిక్చర్ కావడం వల్ల బాగా రష్‌గా ఉంది. బ్లాక్‌లోనే టిక్కెట్లు కొని హాల్లోకి వెళ్ళి కూర్చున్నారు జయ, కళ్యాణి.

"ఈ రోజు కలక్షన్ బాగా ఉందిరా! బ్లాక్‌లో టిక్కెట్లు కొన్నా ఇంకా డబ్బు మిగిలింది." రాత్రికి నా రూమ్‌కి రా! మందు పార్టీ చేసుకుందాం! వెనక్కి తిరిగి చూశారు జయ, కళ్యాణి "ఉదయం శుభలేఖతో వచ్చినతను."

——గౌతమ్‌నాయుడు